క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యుడిగా జగదీష్ నాయక్



కొయ్యూరు: రాజేంద్ర పాలెం పీహెచ్‌సీలో రెండో వైద్యుడిగా జగదీష్ నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా ఆర్‌బీఎస్‌కెలో కాంట్రాక్ట్ వైద్యుడిగా పనిచేసిన ఆయన రెగ్యూలర్ ప్రాతిపదికన ఇక్కడకు వచ్చారు. కొద్ది రోజుల క్రితం నంద్యాల నుంచి స్నేహలత ఇక్కడ వైద్యుడిగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా నాయక్ కూడా బాధ్యతలు స్వీకరించడంతో ఇద్దరు వైద్యులు ఇక్కడ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నారు.

ఎన్ఐటీకి గిరిజన విద్యార్థి మహేంద్ర ఎంపిక



అరకులోయటౌన్: అరకులోయ మండలం గన్నెల గ్రామానికి చెందిన దురియా మహేంద్ర ఎన్ఐటీకి ఎంపికయ్యాడు. జేఈఈ మెయిన్స్‌లో 91 శాతం సాధించి, ఎన్ఐటి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి ఎన్ఐటీలో సీట్ సాధించాడు. దీంతో తల్లిదండ్రులు దురియా సుబ్బారావు పలువురు ఆనందం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.

ఘనంగా అన్నసమారాధన



అన్నదానంలో భక్తులు

వై.రామవరం: వినాయక చవితి, నిమజ్జనాలను పురస్కరించుకుని స్థానిక బస్టాండు ఆవరణలోని కోదండరామాలయం వద్ద శుక్రవారం ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాలమురళీకృష్ణ

కొయ్యూరు: మండలంలోని చిట్టింపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో బాలమురళీకృష్ణ శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం ఆయన డొనూరు పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యులతో మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో అరుణ

ఎటపాక: బాల్యవివాహాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో అరుణ కోరారు. శుక్రవారం బాల్యవివాహాల నిర్మూలన కమిటీ సమావేశం తహసీల్దార్ కారం సుబ్బారావు అధ్యక్షతన ఎటపాకలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తల్లికి, బిడ్డకు అనారోగ్య బారిన పడతారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీన్ని అడ్డుకట్ట వేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, ఎస్‌హెచ్‌వో ఏపీఎం కన్వీనర్ పావని, పంచాయతీ కార్యదర్శులు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలుచేయాలి



ఆదివాసీ మహిళ మండల సంఘం సభ్యులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని శుక్రవారం ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కౌసల్య, హైమవతిల ఆధ్వర్యంలో మండల సంఘం ఎన్నిక జరిగింది. సంఘం అధ్యక్షురాలిగా సీసా విజయ, కార్యదర్శిగా సోనియా ఈశ్వరి, కోశాధికారిగా మీనా, కార్యవర్గ సభ్యులుగా రాధ,దసుదలతో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు విజయ, ఈశ్వరిలు మాట్లాడుతూ ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. గిరిజన మహిళలు, హక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

సమస్యలతో సతమతం



కాడెలి- తామరపల్లి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన తుప్పలు

- చిత్తడి దారులతో సతమతం
- వరదనీటితో నిలిచిపోతున్న రాకపోకలు
- జంగిల్ క్లియరెన్స్ చేయక పెరుగుతున్న ప్రమాదాలు
- ఆందోళనలో వాహనచోదకులు
- పట్టించుకోని అధికారులు

జి.మాడుగుల: మండలంలో పలు రహదారులు అధ్వానంగా మారాయి. జి.మాడుగుల–పాడేరు హైవే రోడ్డు వర్షానికి చిత్తడిగా మారింది. వాహన రాకపోకలు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. పోలీస్‌స్టేషన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం తాత్కాలిక పైపు కల్వర్టు, డైవర్షన్ రోడ్డు వేసి బ్రిడ్జి నిర్మాణం మాత్రం మరిచారు. దీంతో పోతురాజుగెడ్డ వర్షానికి పొంగి ప్రవహించడంతో అధిక సంఖ్యలో వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే రోడ్డు కాంట్రాక్టర్లు రోడ్డు, కల్వర్టులు, వంతెన తవ్వేసి వదిలి పెట్టటం వలన వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారింది. ఈ మార్గంలో పలువురు వాహనచోదకులు తీవ్ర గాయాలపాలైనట్టు తెలిసింది. హైవే రోడ్డులో ప్రయాణించాలంటే ఏ చోట ఏ ప్రమాదం పొంచి ఉందోనని ద్విచక్ర, కార్లు, జీపులు వంటి వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. వర్షానికి మట్టి కొట్టికొచ్చి రోడ్డుపై నుండి ప్రవహించటంవలన రోడ్డు ప్రమాదభరితంగా తయారైందని స్థానికులు చెబుతున్నారు. హైవే రోడ్డు, బ్రిడ్జిలు నిర్మాణాలు కోసం తవ్వేసి నెలలు తరబడి కాంట్రాక్టర్లు వదిలి పెట్టటం వలన వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

పెరిగిన తుప్పలు.. పెరుతున్న ప్రమాదాలు

పాడేరు రూరల్: మండలంలో కాడేలి నుంచి తామరపల్లి మీదుగా వెళ్లే రహదారికి ఇరువైపులా భారీగా తుప్పలు పెరిగాయి. నెలల తరబడి జంగిల్ క్లియరెన్స్ చేయలేదు. పిచ్చిమొక్కలు బాగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు చెబుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



పాడేరు రోడ్డు మార్గంలో పోలీస్ స్టేషన్ సమీపంలో వరదనీరు ముంచెత్తడంతో నిలిచిన వాహనాలు (ఫైల్)

సెల్ సిగ్నల్ లేక అవస్థలు

డుంబ్రిగుడ: మండలంలోని కొల్లాపుట్టు పంచాయతీలో సెల్ సిగ్నల్ లేక గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామ సచివాలయ సిబ్బంది పలు ఆన్‌లైన్ పనులు చేసేందుకు నానా అవస్థలు పడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ పనిచేయకపోవడంతో సమీపంలో కొండలపై వెళ్లి ఆన్‌లైన్ అప్‌డేషన్ పనులు చేయాల్సిన దుస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కొల్లాపుట్టు వద్ద సెల్ సిగ్నల్ తక్షణమే ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



కొల్లాపుట్టులో సిగ్నల్ లేక కొండపై వచ్చి పనిచేస్తున్న సచివాలయం సిబ్బంది



ఆన్‌లైన్ పనుల కోసం వేచి ఉన్న గిరిజనులు



పోతురాజుగెడ్డ డైవర్షన్ రోడ్డుపై వరదనీరు (ఫైల్)

వసతి గృహాన్ని పరిశీలించిన అరకు ఎమ్మెల్యే



వసతి గృహం పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని గురుకులం బాలుర కళాశాల, పాఠశాలలను అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తునఆహారాన్ని పరిశీలించారు. వసతి గృహాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వర్షకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, శ్లాబ్ లీకేజితో గదుల్లో నీరు కారుతోందని, పాత భవనాలు కావడంతో ఎప్పుడు ఏం జరుగుతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్ తదితరులున్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురంలో నిర్వహిస్తున్న గ్రామసభ

ముంచంగిపుట్టు: ఆదికర్మ యోగి అభియాన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి వెళ్లే సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ కొర్ర త్రినాథ్ అన్నారు. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో శుక్రవారం ఆదికర్మ యోగి కార్యక్రమం గ్రామసభను నిర్వహించారు. లక్ష్మీపురంలో నెలకొన్న సమస్యలను గుర్తించారు.ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ ఆదికర్మ యోగి అభియాన్ ద్వారా గ్రామాల్లో సమస్యలు గుర్తించామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన వాటిని పరిష్కరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి గలిత్, ఉప సర్పంచ్ సత్యం, నాయకులు సాధురాం, పీసా కమిటీ సభ్యుడు నీలకంఠం, గ్రామ సచివాలయ ఉద్యోగులు రాజుపడాల్, సాయి, మాధవి, సుమలత, భాను తదితరులు పాల్గొన్నారు.



దుశ్చర్తిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

అడ్డతీగల: మండలంలోని దుశ్చర్తిలో ఆది కర్మయోగి అభియాన్ గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పలు గ్రామాల్లో సమస్యలు గుర్తించామన్నారు. సమాలోచనల ఆధారంగా ప్రజావసరాలకు అనుగుణంగా విజన్ మ్యాప్ తయారుచేసి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా మార్చడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సర్పంచ్ పల్లాల నాగరత్నం, వివిధ శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



డుంబ్రిగుడలో కురుస్తున్న వర్షం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో గిరిజన గ్రామల నుంచి మండల కేంద్రానికి వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అరకు వారపుసంత బురదలోనే జరిగింది. రోజూ వర్షాలు కురుస్తుండడంతో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. రాకపోకలకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అరకు ఎమ్మెల్యే పరామర్శ



మాజీ ఎంపీపీ జమునను పరామర్శిస్తున్న అరకులోయ ఎమ్మెల్యే మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గురువారం ఉదయం ఆటో బోల్తా ప్రమాదంలో గాయాలపాలై ఇంట్లో విశ్రాంతి పొందుతున్న మాజీ ఎంపిపి వంతల జమున, ఆమె కుమార్తె వంతల బబీతను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. డుంబ్రిగుడ, అరకులోయ వైఎస్సార్‌సీపీ మండలాల అధ్యక్షులు పాంగి పరశురామ్, స్వామి రామ్మూర్తి, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, పోతంగి సర్పంచ్ వంతల వెంకటరావు, మండల కార్యదర్శి మఠం శంకర్, పంచాయతీ అధ్యక్షుడు విజయదశమి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ నుంచి రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి బదిలీపై వెలుతున్న సీహెచ్‌సీ సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్‌కు శుక్రవారం వీడ్కోలు సభ ఏర్పాటు చేసి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సూపరింటెండెంటు డాక్టర్ రాహుల్ మెరుగైన వైద్య సేవలందించి ఆస్పత్రికి మంచి పేరు తీసుకొచ్చారన్నారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథులతో పాటు సిబ్బంది అందరికి విందు ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు జీవన్, చైతన్య, మస్తాన్, శ్రీహరిబాబు, ఎస్ఐ బి రామకృష్ణ, గ్రామపెద్దలు నారాయణరావు, త్రిమూర్తులు, అమ్మోజీ తదితరులు పాల్గొన్నారు.

మ్యుటేషన్లకు ఆటంకం

కొయ్యూరు: ఆన్‌లైన్‌లో వెబ్‌ల్యాండ్ వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో మ్యుటేషన్లు చేయించుకోవాలని చూస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాజేంద్రపాలెం పీసా కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు స్వామినాయుడు శుక్రవారం విలేకరులకు తెలిపారు. మీ సేవలో ఆన్‌లైన్‌లో వెబ్‌ల్యాండ్ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదన్నారు.ఈ సమస్యను సరిచేయకుంటే చాలా మంది రైతులు ఇబ్బందులు పడతారని తెలిపారు. అధికారులు రైతులు అవస్థలను గమనించాలని కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

పాడేరు రూరల్: ప్రజా సమస్యలు పరిష్కారం కాని ఐటీడీఏ 'మీకోసం' కార్యక్రమం ఎందుకని ఆదివాసీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంతల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఐటీడీఏ నిర్వహిస్తున్న ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజలు తమ సమస్యలను తెలియజేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులను సమన్వాయం చేస్తు స్పందనలో వచ్చిన వినతులకు సకాలంలో పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఆదివాసీ పరిషత్ సభ్యులు మల్లమ్మ, చిన్నారి, నీలమ్మ, చంద్రమ్మ, బోంజుబాబు, రాజారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా పోలీసు స్టేషన్



నూతన పోలీసు స్టేషన్ భవనం

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు మండల కేంద్రంలో నూతన పోలీసు స్టేషన్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రారంభోత్సవానికి భవనం సిద్ధంగా ఉంది.పాత పోలీసు స్టేషన్ శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చివేసి, ఆ స్థలంలోనే నూతన పోలీసు స్టేషన్‌ను రూ.2కోట్లతో అత్యాధునిక హంగులతో నిర్మించారు. గత కొన్ని సంవత్సరాలుగా పోలీసు స్టేషన్‌కు సరైన భవనం లేక తాత్కాలిక భవనంలోనే ఇబ్బందులు పడుతూ నిర్వహణ జరుగుతూ వచ్చింది.వర్షకాలంలో ప్రస్తుతం ఉన్న పోలీసు స్టేషన్ భవనం కారిపోతూ ఉండడంతో రికార్డులు భద్రపరిచేందుకు స్టేషన్ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. పట్టుకున్న గంజాయి సైతం స్టేషన్‌లో నిల్వ ఉంచేందుకు స్థలం లేదు. వివిధ కేసుల్లో పట్టుకున్న ముద్దాయిలను ఉంచేందుకు అవస్థలు పడేవారు. ఉన్న ఒకే భవనంలోనే సర్దుకుపోతూ పోలీసులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. నూతన పోలీసు స్టేషన్ భవనం త్వరలో ప్రారంభం కానుంది. నూతన భవనం అందుబాటులోకి వస్తే పోలీసు స్టేషన్ నిర్వాహణకు అన్ని ఇబ్బందులు తొలగనున్నాయి.

ఎంపీ నిధులతో సోలార్ లైట్లు



సోలార్‌లైట్లు ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి మంజూరు చేసిన నిధులతో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ పార్కు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద సోలార్‌లైట్ల ఏర్పాటుకు అనుకూలమైన స్థలాలను పరిశీలించి, స్తంభాల ఏర్పాటుకు గోతులు తవ్వించారు. ఎంపీ నిధులతో సోలార్ లైట్లు ఏర్పాటు చేయడం, విద్యుత్ అంతరాయం సమయంలో సీహెచ్‌సీ, పార్కు వద్ద ప్రజలకు ఎంతో ఉపయోగం అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు అన్నారు. సోలార్ లైట్ల ఏర్పాటుకు ఢిల్లీ నుంచి టెక్నిషియన్లు వచ్చి పనులు పర్యవేక్షిస్తున్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రమేష్, సర్పంచ్ త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్, కృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



రాయపల్లిలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ విశ్వనాథం తదితరులు

అడ్డతీగల: ట్రైబల్ హెల్త్ అండ్ వెల్ఫేర్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం రాయపల్లిలో సర్పంచ్ చెదల విశ్వనాథం చేతుల మీదగా ప్రారంభించారు. 15 రోజుల పాటు ఉచితంగా మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామని ట్రైబల్ హెల్త్ అండ్ వెల్ఫేర్ సంస్థ డైరెక్టర్ వి.పూర్ణచంద్రనాయుడు అన్నారు. మహిళలు శిక్షణ పొంది స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మొదటి విడతగా 30 మందికి శిక్షణ ఇస్తామన్నారు. తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. రోళ్ళగడ్డ, సీతారం గ్రామాల్లో త్వరలో కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు.

గ్రామాల్లో తాగునీటి పథకాలు మంజూరు



మండల ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మంచినీటి సరఫరా విభాగం డీఈ కరుణ

చింతపల్లి: చింతపల్లి డివిజన్ పరిధిలో 10 తాగునీటి పథకాలకు రూ.70 లక్షల నిధులు మంజూరైనట్టు సబ్ డివిజన్ మంచినీటి సరఫరా విభాగం డిప్యూటీ ఇంజినీర్ కరుణ తెలిపారు. కార్యాలయంలో తమ శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చింతపల్లి మండలం బలపం పంచాయతీలో జువ్వివీధిలో తాగునీటి పథకం పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. మిగిలిన తొమ్మిది ప్రాంతాల్లో తాగునీటి పథకాల నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉందన్నారు. తాగునీటి పథకాల్లో తరచూ క్లోరినేషన్ చేస్తూ, సురక్షిత నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటిని తరచూ పరీక్షలు చేస్తున్నామని, ఇందుకోసం ఎంఎల్‌హెచ్‌పీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఫీల్డ్ టెస్టింగ్ కిట్లును అందజేసినట్టు తెలిపారు. చింతపల్లి, జీకే వీధి మండలాల ఏఈలు స్వర్ణలత, కళ్యాణరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఉపాధ్యాయుల ఆందోళన



జి.మాడుగులలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు



పెదబయలులో తహసీల్దార్ త్రినాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

జి.మాడుగుల: ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో గల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రావుల జగన్‌మోహన్‌రావు, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పెడింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని మెమో 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరుతూ తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు సింహాచలం నాయుడు, కార్యదర్శి ధనుంజయ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వారం రోజుల పాటు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు జర్సింగి మాలంనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ అన్నారు. శుక్రవారం పెదబయలు తహసిల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ నిరసన చేపట్టారు. పలువురు సంఘం నాయకులు మాట్లాడుతూ హెచ్ఎస్ పరిమితి పెంపు, బోధనేతర యాప్స్,అసెస్‌మెంట్ బుక్లెట్ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ త్రినాథరావు నాయుడుకు అందజేశారు. ఏపీటీఎఫ్ నాయకులు రాజేశ్వరరావు, గణపతి, వైకుంఠం, సత్యంపడాల్, ఏదామోదరం, కంద్రన్న, సాదూరం పాల్గొన్నారు.



రెవిన్యూ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అందుబాటులో యూరియా

గూడెంకొత్తవీధి/సీలేరు: మండలానికి 20 టన్నుల యూరియా, ఐదు టన్నుల డీఏపీ వచ్చినట్టు ఏవో గిరిబాబు శుక్రవారం తెలిపారు. ఇందులో ఐదు టన్నుల యూరియా, డీఏపీని రింతాడ పంచాయతీకి, మూడు టన్నులు గుమ్మిరేవులకు, ఆరు టన్నులు దుప్పుల వాడకు యూరియాను కేటాయించారని ఏవో చెప్పారు.